క్లుప్తంగా

పల్లె దవాఖానా నిర్మాణానికి స్థల పరిశీలన



భిక్కనూరు: బస్వాపూర్‌లో రూ.17 లక్షలతో నిర్మించనున్న పల్లె దవాఖానాకు అవసరమైన స్థలాన్ని ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ మంగళవారం పరిశీలించారు. గ్రామస్తులతో కలిసి వారాంతపు సంతలో స్థలాన్ని పరిశీలించి అక్కడే నిర్మించాలని నిర్ణయించారు. ఆయన వెంట నేతలు మల్లారెడ్డి, బాగారెడ్డి, సిద్ధరాములు ఉన్నారు.

తుంకిపల్లిలో వరి ధాన్యం..



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని తుంకిపల్లి గ్రామ వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం క్లస్టర్ ఏఈవో మధుసూదన్ పరిశీలించారు. ఆ కొనుగోలు కేంద్రంలో వరిధాన్యం తాలు, తేమ శాతాన్ని తెలుసుకున్నారు. ధాన్యం శుభ్రం చేసిన తర్వాతే విక్రయాలు జరపాలన్నారు.

వన నర్సరీలు..



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలంలోని బస్వాపూర్, మహమ్మదాబాద్ గ్రామాల్లోని వన నర్సరీలను మంగళవారం స్థానిక ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు. ఆయా నర్సరీల్లోని చెట్ల మధ్యన ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి నీటి సంరక్షణ చేపట్టాలని అన్నారు. ఉపాధి కూలీలతో వన నర్సరీలను శుభ్రం చేయించాలని ఈజీఎస్ సిబ్బందికి సూచించారు.

కందర్‌పల్లి, ఫత్లాపూర్‌లలో..



బిచ్కుంద(జుక్కల్): మండలంలోని కందర్‌పల్లి, ఫత్లాపూర్ గ్రామ పంచాయతీలను మంగళవారం ఎంపీవో మహిబూబ్ సందర్శించి రికార్డులు పరిశీలించారు. వర్షాకాలం వస్తున్న సందర్భంగా తాగునీటి పైప్‌లైన్ లీకేజీల ద్వారా నీరు కలుషితం కాకుండా చూడాలని, ప్రతి రోజు క్లోరినేషన్ చేసిన నీటిని అందించాలన్నారు. అనంతరం వన నర్సరీ, వైకుంఠధామం, కంపోస్టుషెడ్డు, పల్లె ప్రకృతివనం పరిశీలించారు. పలు సూచనలు సలహాలు అందించారు.

డీఎల్‌పీవో ఆకస్మిక తనిఖీ



నస్రుల్లాబాద్(బాన్సువాడ): అంకోల్ తండా గ్రామ పంచాయతీని డీఎల్‌పీవో నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని పల్లె ప్రకృతి వనం, కంపోస్టు షెడ్డు, వైకుంఠ ధామం, నర్సరీలను పరిశీలించారు. వాటి నిర్వహణ బాధ్యత సక్రమంగా చేపట్టాలని పంచాయతి కార్యదర్శిని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీవో రాము, పంచాయతి కార్యదర్శి ఫయాజ్, సిబ్బంది ఉన్నారు.

కొనుగోళ్లలో జాప్యంపై రైతుల ఆందోళన



లింగంపేట(ఎల్లారెడ్డి): కొనుగోలు కేంద్రానికి ధాన్యం తరలించి నెల రోజులు గడుస్తున్నా తూకం వేసిన ధాన్యం రైస్ మిల్లుకు తరలించడంలో జాప్యం చేస్తుండడంతో కొర్పోల్ గ్రామ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం తహసీల్దార్, కొర్పోల్ గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యలను తహసీల్దార్‌కు వివరించారు. రెండు రోజుల్లో ధాన్యం తరలిస్తామని తహసీల్దార్ నరేందర్ హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.



నిజాంసాగర్‌లో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు



బిచ్కుందలో..



ఎల్లారెడ్డిలో ..

రాజీవ్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా మంగళవారం నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాజీవ్ ఆశయ సాధనకు కృషి చేద్దామని ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. రాజీవ్ గాంధీ హయాంలోనే దేశంలో ఐటీ రంగం గణనీయంగా అభివృద్ధి సాధించిందని అన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



జిల్లా కేంద్రంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ



నాగిరెడ్డిపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ..



భిక్కనూరులో..



దోమకొండలో ..



మాచారెడ్డిలో..



పిట్లంలో..

ఆధ్యాత్మికం

వైభవంగా రేణుకామాత, ఎల్లమ్మ కల్యాణం



దోమకొండ: మండల కేంద్రంలో రేణుకామాత ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారి కల్యాణం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం అమ్మవారికి ప్రతి ఇంటినుంచి డప్పుచప్పుళ్ల మధ్య బోనాలను తీశారు. బుధవారం ఉదయం తిరుగు బోనాలు, చక్రతీర్థంతో ఉత్సవాలు ముగుస్తాయి. జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, ఆలయ కమిటి అధ్యక్షుడు నాగభూషణంగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఇస్రోజీవాడిలో..

కామారెడ్డి రూరల్: ఇస్రోజీవాడి గ్రామంలో మంగళవారం రేణుకామాత జమదగ్నిల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఇంటికో బోనం చొప్పున గ్రామస్తులందరు కలిసి బోనాలను ఊరేగించి అమ్మవారికి సమర్పించారు.

సిద్ధరామేశ్వరాలయంలో వాస్తు హోమ పూజలు



భిక్కనూరు: సిద్ధరామేశ్వరాలయంలో వాస్తు హోమ పూజలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. హైకోర్టు న్యాయవాది పెద్దబచ్చగారి రాంరెడ్డి–క్రిష్ణకుమారి దంపతుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న ఈ వాస్తు హోమ పూజలకు కర్నాటక రాష్ట్రంలోని ఉడిపి నుంచి విచ్చేసిన వేద పండితులకు ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈవో శ్రీధర్, ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ అందె మహేందర్‌రెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ లింబాద్రి, తదితరులు పాల్గొన్నారు.

చుక్కాపూర్ ఆలయంలో నవకలశస్నపనం



మాచారెడ్డి: చుక్కాపూర్ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం నవకలశ స్నపనం ఘనంగా నిర్వహించారు.ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో శ్రీధర్ రావు, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి, సిబ్బంది, అర్చకులు ఉన్నారు.

కాలభైరవుడికి ప్రత్యేక పూజలు

రామారెడ్డి: ఇసన్నపల్లి(రామారెడ్డి) శ్రీకాళభైరవుడికి వైశాఖ మాస పూజలు కొనసాగుతున్నాయి. వైశాఖమాసం రెండో మంగళవారం సందర్భంగా కాలభైరవుడికి 108 రకాల స్వీట్లతో అలంకరించారు. భక్తులు ఉదయం నుంచి భారీగా తరలివచ్చి కాలభైరవుడికి జనాభిషేకాలు సింధూర పూజలు నిర్వహించారు. భజన కార్యక్రమాలు ప్రారంభించారు. ఆలయ ఈవో ప్రభు గుప్తా, అర్చకులు పాల్గొన్నారు.

అమ్మ భవాని మాత ఉత్సవాలు



బాన్సువాడ రూరల్: బుడిమి గ్రామంలో మంగళవారం అమ్మ భవాని మాత ఆలయ వార్షికోత్సవాన్ని గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. గతంలో ఎడ్లబండ్లను అందంగా అలంకరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించే వారు.. కాలక్రమేణా జోడెడ్లు, ఎడ్లబండ్లు కనుమరుగు కావడంతో ట్రాక్టర్లను అందంగా అలంకరించి ఆలయం చుట్టూ తిప్పారు.ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలు మూడు రోజులపాటు ఘనంగా జరుగుతాయని గ్రామస్తులు తెలిపారు.

ఆకట్టుకున్న గంగమ్మ బోనాల జాతర



నిజాంసాగర్(జుక్కల్): అమ్మా బైలెల్లినాదో...అమ్మవారు బైలెల్లినాది అంటూ శివసత్తుల పూనకాలు, బ్యాండు మేళాలు, డీజే పాటలతో గంగమ్మ తల్లి బోనాల ఊరేగింపు ఉత్సవం ఆకట్టుకుంది. మంగళవారం మహమ్మద్‌నగర్ నర్వ గ్రామ పాత చెరువు కట్ట వద్ద ఉన్న గంగమ్మ ఆలయం రెండో వార్షికోత్సవాలను బేస్తం సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బేస్త కులస్తులు ఇంటికో బోనంతో అమ్మవారికి ఆలయానికి ఊరేగింపు ర్యాలీగా తరలి వచ్చారు. బేస్త సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం

నిజాంసాగర్(జుక్కల్): ఆరేడ్ గ్రామంలో రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం మంగళవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. వేకువజామున నుంచి ఎల్లమ్మ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



తాడ్వాయి (ఎల్లారెడ్డి): దేమికలాన్ శివారులో మంగళవారం విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ నెల 20న సాక్షి దినపత్రికలో 'ట్రాన్స్‌ఫార్మర్ కాలినా పట్టించుకోరా' అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. దీంతో ట్రాన్స్‌కో అధికారులు స్పందించి మంగళవారం కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి దాని స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

సాక్షి ఎఫెక్ట్..

కంపోస్టు షెడ్డు నిర్వహణను మెరుగుపర్చుకోవాలి



కామారెడ్డి రూరల్: గ్రామాల్లో కంపోస్టు షెడ్డుల నిర్వహణను మెరుగుపర్చుకోవాలని ఎంపీవో మలహరి సూచించారు. మంగళవారం ఉగ్రవాయిలో ఆయన కంపోస్టు షెడ్డు, నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తడి, పొడి చెత్త వేర్వేరుగా ట్రాక్టర్‌ల ద్వారా సేకరించి కంపోస్టు షెడ్డులో వేసి ఎరువులను తయారు చేయాలన్నారు. ఎరువును రైతులకు విక్రయించి ఆదాయాన్ని పెంచుకోవాలన్నారు. గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులున్నారు.

అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలి

కామారెడ్డి అర్బన్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వరి రైతులను నిలువునా మోసం చేసిందని బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి నల్లవెల్లి అశోక్ ఒక ప్రకటనలో ఆరోపించారు. శాసన సభ ఎన్నికల హామీల్లో వరి రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించి అధికారంలోకి వచ్చిన తర్వాత సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని చెప్పడం రైతులను నిలువునా మోసం చేయడం కిందకే వస్తుందని ఆయన విమర్శించారు. అన్ని రకాల వడ్లకు బోనస్ అందించాలని డిమాండ్ చేశారు.

సంక్షిప్తం

ఆర్గానిక్ పోశవ్వకు అభినందనలు



కామారెడ్డి అర్బన్: కామారెడ్డికి చెందిన దివ్యహస్తం ఆర్గానిక్ ఉత్పత్తుల సంస్థ యాజమాని చింతల పోశవ్వను మంగళవారం యోగా, స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. దివ్యాంగురాలైన పోశవ్వ ఆత్మవిశ్వాసంతో ఆర్గానిక్ ఉత్పత్తులను తయారు చేస్తూ మార్కెటింగ్ చేయడం అభినందనీయమని యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాంరెడ్డి అన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

ఎల్లారెడ్డి: వెంకటాపూర్‌లో తాగునీటి సమస్యను తీర్చినందుకు గ్రామస్తులు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో నీటి సమస్య ఉండడంతో ఎమ్మెల్యేను సంప్రదించగా నూతనంగా బోరును తవ్వించి నీటి సమస్యను పరిష్కరించినట్లు వారు తెలిపారు. సమస్యను పరిష్కరించినందుకు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

24న మండల సమాఖ్య సమావేశం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): స్థానిక ఐకేపీ కార్యాలయంలో ఈ నెల 24న మండల సమాఖ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఐకేపీ ఏపీఎం రవీందర్ తెలిపారు. ఉదయం 10 గంటలకు మండల సమాఖ్య అధ్యక్షురాలు యశోదబాయి అధ్యక్షతన ఈ సమావేశం ప్రారంభమవుతుందని చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల గ్రామ సంఘాల అధ్యక్షులు, సీసీలు, సిబ్బంది సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఒకే జీపీ పరిధిలోకి రైతు నగర్ గ్రామం



బాన్సువాడ: ఒకే గ్రామ పంచాయతీ(జీపీ) పరిధిలోకి రైతు నగర్ గ్రామాన్ని విలీనం చేశారు. బాన్సువాడ, బీర్కూర్ ఎంపీడీవోలు బషీరుద్దీన్, భారతిలు మంగళవారం రైతు నగర్ గ్రామాన్ని సందర్శించారు. గతంలో రైతు నగర్ గ్రామం బాన్సువాడ మండలం కొల్లూర్ గ్రామ పంచాయితీలో సగం, బీర్కూర్ మండలం అన్నారం గ్రామ పంచాయితీలో సగం ఉండేది. కొత్త గ్రామ పంచాయితీల ఏర్పాటులో రైతు నగర్ గ్రామాన్ని గ్రామ పంచాయితీగా ఏర్పాటు చేశారు. దీంతో బాన్సువాడ, బీర్కూర్ ఎంపీడీవోలు కొల్లూర్ గ్రామ పంచాయితీలో ఉన్న గృహాలు, శివారు ప్రాంతాన్ని, అన్నారం గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్న గృహాలను, శివారు ప్రాంతాలను రైతు నగర్ గ్రామ పంచాయతీలో విలీనం చేశారు. రైతు నగర్ గ్రామ పంచాయితీ బీర్కూర్ మండలంలో ఉంది. రెండు మండలాలు, రెండు గ్రామాల పరిధిలో ఉన్న గ్రామస్తులు ఒకే గ్రామ పంచాయితీలో విలీనం కావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జీలుగ విత్తనాల పంపిణీ



బాన్సువాడలో విత్తనాలు పంపిణీ చేస్తున్న అంజిరెడ్డి

బాన్సువాడ : బాన్సువాడ సహకార సంఘంలో మంగళవారం రైతులకు జీలుగ విత్తనాలను జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు అంజిరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ. 1116 చెల్లించి 30 కేజీల జీలుగ విత్తనాల బస్తా తీసుకెళ్లాలని అన్నారు. ఆధారుకార్డు, పట్టదారు పాసుపుస్తకం, రైతు మొబైల్ నంబర్ తీసుకుని సహకార సంఘం వస్తే జీలగ విత్తనాలు అందజేస్తామని అన్నారు. సహకార సంఘం అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కార్యదర్శి నారాయణరెడ్డి, నాయకులు పోత్‌రెడ్డి, గులెపల్లి మొగులయ్య, కృష్ణారెడ్డి, విఠల్ తదితరులున్నారు.

బిచ్కుంద(జుక్కల్): పుల్కల్, బిచ్కుంద సొసైటీలలో రైతుల కోసం జీలుగ విత్తనాలు అందుబాటులో ఉంచామని మండల వ్యవసాయ అధికారి రాజలింగం తెలిపారు. ప్రతి రైతు జీలుగ విత్తనాల అలికి పెరిగిన తర్వాత పొలంలో కలియదున్నిన తర్వాత మగ్గితే మొలకలు ఎరువు లాగా పనిచేసి మంచి బలాన్ని అందిస్తుందన్నారు.

రథోత్సవానికి సర్వం సిద్ధం



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని రథ్‌గల్లీలోని శ్రీ లక్ష్మీనారాయణ ఆలయంలో రథపౌర్ణిమ సందర్భంగా ఈ నెల 23, 24వ తేదీల్లో రెండు రోజులు నిర్వహించే రథోత్సవానికి నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. ఆలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయం నుంచి పాత బస్టాండ్‌లోని హనుమాన్ ఆలయం వరకు రెండు రోజులు రథం ఊరేగింపు నిర్వహిస్తారు. భజన, కీర్తన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ నెల 24న కుస్తీ పోటీలు నిర్వహిస్తామని ఆసక్తి గల వారు పాల్గొనాలని వారు కోరారు.

వైద్య సేవలను మెరుగుపర్చాలి



కామారెడ్డి టౌన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలను మెరుగుపర్చాలని జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ వైద్యులు, సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆయన దేవునిపల్లి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరుపట్టిక, రికార్డులను పరిశీలించారు. వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త వంతెన కోసం ఎదురుచూపులు



వరదకు కూలిపోయిన వంతెన

పెద్దకొడప్‌గల్(జుక్కల్): పోచారం, పోచారం తండా గ్రామాల మధ్యలో కొత్త వంతెన నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. పోచారం తండా నుంచి పోచారం గ్రామానికి వెళ్లే దారిలో 2009లో నిర్మించిన వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. రెండు సంవత్సరాల క్రితం కురిసిన భారీ వర్షాలకు సగం వంతెన పూర్తిగా కూలి పోయింది. ఈ వంతెన కోసం గత ప్రభుత్వం రూ.80 లక్షలు మంజూరు చేసినప్పటికి పనులు ప్రారంభించలేదు. కొద్ది రోజుల్లో వర్షా కాలం సమీపిస్తుండటంతో ఈ ఏడాది కూడా వంతెన దాటడానికి ఇబ్బందులు తప్పవని ఇరు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి నూతన వంతెన కోసం కృషి చేయాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



హాజరైన పూర్వ విద్యార్థులు

బాన్సువాడ : బాన్సువాడలోని సాయికీర్తి జూనియర్ కళాశాలలో 2001–03 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థులకు పాఠాలు బోధించిన గురువులను ఘనంగా సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు.

నర్సన్నపల్లిలో కేంద్ర బృందం పర్యటన



ఎస్‌హెచ్‌జీ సభ్యులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

కామారెడ్డి రూరల్: నర్సన్నపల్లిలో మంగళవారం కేంద్ర ప్రభుత్వ సచివాలయ ఉద్యోగులు పర్యటించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు ఎలా అందుతున్నాయి..అందులోని లోటుపాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర వాటిపై వారు అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని సెల్ఫ్ హెల్ప్ గ్రూపు(ఎస్‌హెచ్‌జీ) సభ్యులతో మాట్లాడి తీసుకున్న రుణాలను ఏ విధంగా వినియోగిస్తున్నారు. ఆదాయాభివృద్ధి ఎలా పెంచుకుంటున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం హైస్కూల్‌ను సందర్శించారు. ఎలక్ట్రిసిటీ, ఐసీడీఎస్ ఉద్యోగులతో మాట్లాడి వాటి అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో నాగవర్ధన్, ఎంపీవో మలహరి, గ్రామ కార్యదర్శి నవనీత తదితరులున్నారు.